# నా సాధన కథ



మోక్షానంద స్వామి

# నా సాధన కథ

మోక్షానంద స్వామి

ప్రచురణ

**ఆర్ట్స్ అండ్ లెటర్స్**

హైదరాబాద్ స్టడీసర్కిల్

ఇందిరాపార్క్ క్రాస్‌రోడ్స్, దోమలగూడ

హైదరాబాద్ - 500029

ఫోన్: 040-27635654

జీవితం ద్వారా మానవుడు ఆత్యంతికదుఃఖనివృత్తిని, పరమానందప్రాప్తిని తనలో అనుభూతి చెందాలి. అట్టి జీవితమే నిజమైన జీవితం. ఇందుకోసం కొందరు దైవంమీద ఆధారపడతారు. దైవం మీద ఆధారపడని బౌద్ధం కూడా ఆత్యంతికదుఃఖనివృత్తినే జీవనలక్ష్యంగా పేర్కొంది. నా సాధన ప్రేమభక్తితో, అద్వైతంతో మొదలై బౌద్ధంలోనికి పరిణామం చెందింది. అది ఎలా జరిగిందో తెలిపే కథే నా సాధనకథ.

మనిషికి దివ్యత్వంవేపు ఆసక్తి ఎలా కలుగుతుంది? ఎందుకు కలుగుతుంది? అనే విషయాలను విచారిద్దాము. సాధారణంగా చెప్పాలంటే మానవుడు జీవితంలోని బాధల్ని భరించలేక తనకగోచరమై తనకంటే ఉన్నతమైన శక్తి ఒకటి ఉందని విశ్వసించి వేడుకుంటున్నాడు. 'ఇది ఉత్త విశ్వాసమేనా? లేక దైవం, దివ్యత్వం అనేవి నిజంగా ఉన్నాయా?' అన్న ప్రశ్నకు నేడు లోకం వ్యాప్తిలో ఉన్న అనేకమతాలు 'అవున'నే సమాధానం చెపుతున్నాయి.

మానవుడు దైవాన్ని కేవలం భయపడి మాత్రమే నమ్ముతున్నాడా? అలా అయితే అధికారి, సేవకుని మధ్య ఉండే సంబంధం లాంటిదేనా ఇదికూడా అంటే కాదనే చెప్పవచ్చు. మానవుడు తన నిజచైతన్యంలో బ్రహ్మమే. ఆ బ్రహ్మమే ఈ సమస్త లోకాలుగా, జీవులుగా రూపొందింది. ఒక్క నీరే గంగా నదిలో, చెరువులో, మురికి నీటి కాలువలో ఉన్నట్లుగా, బ్రహ్మమే ఆత్మ రూపముగా మంచివారిలోనూ, చెడ్డవారిలోనూ, పశువులలోనూ, పక్షులలోనూ సర్వత్రా వ్యాపించి ఉంది. సత్యానికి మరీ దగ్గరగా ఆలోచిస్తే శుద్ధమైన నీటికి రంగు, రుచి, వాసనా లేనట్లే, భగవంతునికి కూడా గుణము, రూపము ఏమీ లేవు. ఇవన్నీ ప్రకృతిద్వారా భగవంతున్ని దర్శించుకుందామనుకునే సరికి వస్తాయి.

సృష్టిలో ఉన్నది ఏకత్వమైనపుడు మానవుడూ అందులోని వాడే. కాని తన నిజతత్త్వాన్ని మరచి, గుణాలప్రభావంతో తాను ఆ పరతత్త్వమునకన్నా భిన్నమైన వాడైనట్లు తలుస్తున్నాడు. అట్టి గుణముల మూలరూపాన్నే ప్రకృతి అన్నారు. ఈ ప్రకృతిని యోగమార్గం ద్వారా జయించి, మానవుడు తన యథార్థ స్వరూపాన్ని తెలుసుకోవలసి ఉంటుంది. ప్రకృతి అనే ఈ తెరను తొలగించుకొని వెళ్లాలని నిశ్చయించుకొన్నవారు తమ జీవితాలను అందుకనుగుణంగా రూపొందించుకొని, త్వరగా గమ్యాన్ని చేరుకొంటారు. ఆ యోగవిజ్ఞానం గురుశిష్య పరంపర ద్వారా ఈనాటికీ నిలిచి ఉంది. పుస్తకాల ద్వారా ఒక విషయాన్ని గురించిన సమాచారాన్ని పొందవచ్చు కాని అనుభవాన్ని మాత్రం పొందలేము. అందుకొరకు యోగానుభవసంపన్నులైన మహాత్ముల దగ్గరకు పోక తప్పదు. మనిషిలో నిద్రాణంగా ఉన్న పరతత్త్వపు ఆకర్షణ వెలువడటానికి ఒక మహాపురుష సందర్శనమో, మహాపురుష జీవితచరిత్ర పఠనమో, దివ్యసంగీత శ్రవణమో ఏదైనా కారణం కావచ్చు. నా జీవితంలో అలాంటి మేల్కొల్పు ఎలా కలిగిందో వివరిస్తాను.

మా ఊరు నిజామాబాద్ జిల్లా మోర్తాడు మండలం తిమ్మాపూర్. మాది మధ్యతరగతి వ్యవసాయకుటుంబం. మా నాన్నగారి పేరు గంగారాం. అమ్మపేరు లింగమ్మ. మా ఇంటిపేరు సోమ. మేము ముగ్గురం అన్నదమ్ములం, ఒక చెల్లెలు. నేను రెండవవాన్ని. నా తర్వాత చెల్లెలు. ఆమె తర్వాత తమ్ముడు. స్కూలు రిజిస్టరులో రాయబడిన ప్రకారం నా పుట్టినతేది 14-6-1952. కాని నేను సక్రాంతిపండుగ ముందర పుట్టానని తెలిసింది. అందువలన అది జనవరి 1953 కావటానికి అవకాశం ఉంది. అప్పటికి (58 ఏళ్ల క్రితం) ఈ ప్రాంతంలో వ్యవసాయదారులు చదువు విలువను గుర్తించలేదు. నా తరంలో మా ఇంటిలో చదువుకున్నది నేనొక్కన్నే. ఒకనాడు మా నాన్నగారు నేనూ పసుపు తోటనుండి ఇంటికి వస్తుండగా త్రోవలో మా ఊరి స్కూలు ప్రధానోపాధ్యాయుడు రాములుసారు ఎదురైనపుడు 'మీవానికి అయిదేళ్లు దాటి ఉంటాయి. స్కూలుకు పంపండి' అన్నారు. 'సరే' అన్నారు మా నాన్న. అలా నేను బడికి వెళ్లటం కూడా కాకతాళీయంగానే జరిగింది. అయిదవ తరగతివరకు తిమ్మాపూర్‌లో, 6వ తరగతినుండి 10 తరగతి వరకు మోర్తాడ్‌లో సాగింది నా చదువు.

బాల్యస్మృతులను చెప్పాలని ఉన్నప్పటికీ ఇది నా అత్మకథ కాదు. నా సాధన కథ మాత్రమే. అందువలన సాధనకు సంబంధించి బాల్యంలో నేను పొందిన ఒకటి రెండు అనుభవాలను మాత్రం ఇక్కడ పేర్కొంటున్నాను.

అప్పటికి నా వయస్సు 5, 6 సంవత్సరాలు ఉండవచ్చు. అప్పుడు అనేకరోజులు నడిరాత్రి కలలో ఈ దృశ్యం కనిపించేది – 'పలుచగా ఉన్న వెలుతురులో అంతటా పొదలు. మిట్ట పల్లాలుగా ఉన్న నేలపై వర్షం పడినపుడు ప్రవహించి, ఆ తర్వాత ఎండిపోయిన అనేక చిన్న, చిన్న కాలువలు. అంతటా భీతిగొలిపే నిశ్శబ్దం. ఒక కాలువ ప్రక్కన నల్లని మేక.' అర్ధరాత్రి నిద్రలో ఈ దృశ్యాన్ని చూసి భయపడి బిగ్గరగా ఏడ్చేవాన్ని. ఆ దృశ్యాన్నే చూస్తూ పడకమీదినుండి లేచి గొళ్లెం తీసుకుని, ఏడుస్తూనే బయటకు వెళ్లేవాన్ని. అలా నడుస్తూ వెళుతున్నా మనసుముందు అదే దృశ్యం కనిపించేది. బాహ్యస్మృతి వచ్చేది కాదు. మా అమ్మ, నాన్నలు నా వెంట వచ్చి గట్టిగా పిలువగా, పిలువగా అప్పుడు ఆ దృశ్యంలోనుండి బయటకు వచ్చేవాన్ని. ఇలా ఒకనాడు కాదు, అనేకదినాలు జరిగింది.

ఇప్పుడు ఆ దృశ్యాన్ని విశ్లేషించుకోగా, అనుమానప్రమాణాన్ని బట్టి తెలిసే విషయం ఇది–గతజన్మలో కూడా నేను సాధకుడనే. జీవితమంతా మనస్సుమీద అదుపు సంపాదించటానికి ప్రయత్నించినవాన్నే. కాని జన్మాంతంలో, ఆ చివరిక్షణాన్ని నా అదుపులో ఉంచుకోలేకపోవటం వలన కర్మసూత్రం ప్రకారం మరుజన్మ నిర్ణయమైంది. అప్పుడు రూపొందిన పై దృశ్యాన్ని చూచి, నేను దుఃఖంతో శరీరాన్ని వదలిఉంటాను. ఆ దృశ్యం బాల్యంలో నన్ను వెంటాడేది. ఇందులోని వెలుతురు నా కుశలచేతసికానికి, మేక అకుశల చేతసికానికి సూచకాలు. ఈ జన్మలో ధ్యానాన్ని ఆరంభించినతర్వాత, అప్పుడు అదుపులో లేకుండా పోయిన విషయాలను అదుపులోనికి తెచ్చుకోవటానికి మళ్లీ పోరాటం మొదలైంది.

రెండవ అనుభవం. నేను ఏడవతరగతిలో ఉన్నపుడు (1967లో) ఒకనాడు తిమ్మాపురంనుండి మోర్తాడుకు వెళుతూ ఉన్నాను. అది హేమంత ఋతువు. అప్పుడు సమయం ఉదయం పది, పదకొండు అయిఉండవచ్చు. ఒక ఎడ్లబండి మోర్తాడుకు వెళుతూ ఉంటే అందులో కూర్చున్నాను. పైరగాలి చల్లగా వీస్తుంది. ఎండ చర్మానికి తాకి హాయినిగొలుపుతూ ఉంది. త్రోవప్రక్కన ఏపుగా పెరిగిన చెరుకు. బాటమీది ఇసుకలో చప్పుడు చేస్తూ తిరుగుతున్న బండిచక్రాలు. క్రమంగా నేను స్పృహ కోల్పోయి తన్మయత్వంలోకి వెళ్లాను. నాకు మెలకువ వచ్చేసరికి బండి మొండివాగు దాటుతూ ఉంది. అంటే బండి దాదాపు కి.మీ. దూరం పయనించేంతవరకూ నేను ఆ స్థితిలో ఉండిపోయాను.

ఏడవ తరగతిలో ఉన్నప్పుడే హేమంత ఋతువులో, ఒకనాటి సాయంసంధ్యాసమయంలో, మా వేరుసెనగ చేనులో ఇలాగే తన్మయత్వంలోకి వెళ్లి చాలాసేపటికి ఎరుకలోకి వచ్చాను.

1969 లో పదవ తరగతి పరీక్షలు వ్రాసి వేసవి సెలవుల్లో మా ఊరిలో ఉన్నాను. యువజనసంఘ అధ్వర్యంలో, పుస్తకాలు ప్రోగుచేసి చిన్న గ్రంథాలయం స్థాపించాలనే ప్రయత్నంలో ఉండగా శ్రీ చిరంతనానంద స్వాములవారు వ్రాసిన వివేకానంద జీవిత చరిత్ర లభించింది. అన్ని పుస్తకాల్ని చదివినట్లే దాన్నీ చదివాను కాని అది నా జీవిత విధానాన్నే మార్చివేసింది. అద్భుతమైన ఆ చరిత్రను ఎన్ని సార్లు చదివినా తనవి తీరలేదు. లోకోత్తరుడైన ఆ మహాపురుషుని అనుభవాలు నన్ను పులకింపజేశాయి. ఇప్పటికీ ఆ యోగివరేణ్యుడు విశ్వమత మహాసభ వేదిక మీద జలద గంభీరస్వరంతో ఉపన్యసిస్తున్న దృశ్యం నా మనోవీధిలో తారట్లాడుతూనే ఉంది. జీవితపరమార్థాన్ని అన్వేషించటానికి, ఆ గ్రంథం చక్కని ఉపోద్ఘాతంలా పనిచేసింది. ముందరి సంకుచిత జీవితంకాక ఒక విశాలమైన ఆధ్యాత్మికజగత్తు కనుల ముందు గోచరించింది. అది నన్ను ఊపివేసింది. అలాంటి జీవితం గడపాలని మనస్సు తహతహలాడింది. అప్పటి వరకు నాలో తెలియకుండా ఉన్న ఆవేదన ఇతర రూపాల్లో తనను వ్యక్తం చేసుకునేది. అది ఒక కాల్పనిక జగత్తు. ఎండాకాలం శుక్లపక్షపు రాత్రుల్లో, జగమంతా వెన్నెలలో తళుకులీనే వేళ “చలేజా! చలేజా! జహా ప్యార్ మిలే!” అని పాడుకుంటూ, ఊరి బయట విశాల మైదానంలో కూర్చొని వెన్నెలతో, నక్షత్రాలతో, ఆ సమస్త దృశ్య సౌందర్యంతో తాదాత్మ్యం చెంది నన్ను నేను మరిచి పోయేవాన్ని. మనస్సుకు దృశ్యప్రపంచం మీద పూర్తివిరాగమూ కలుగలేదు. అలా అని అదృశ్యప్రపంచం వేపు పరుగెత్తటమూ మానలేదు. బ్రహ్మముయొక్క సాకార, నిరాకారాలు రెండింటిలోనూ ఐక్యం కావాలనే తపన హృదయంలో... ఇప్పుడు నాలో ఇంతవరకు గూఢంగా ఉన్న వేదన గురించి తెలుసుకోగలిగాను. అప్పుడే పదవ తరగతి పాసై ఇంటర్మీడియట్‌లో చేరాను.

ఇంటర్మీడియట్ ఆర్మూర్‌లో చదివాను. అప్పుడు ప్రతి సాయంత్రం నల్లని ఎత్తయిన ఆర్మూరు కొండల మీద కూర్చుని, నీలాకాశంకేసి, వృక్షాలకేసి, చెరువుల కేసి చూస్తుంటే, మనస్సంతా ఏమిటో తెలియని వ్యథతో నిండిపోయేది. పండువెన్నెల రాత్రుల్లో, కొంత పసుపువర్ణంలోకి మారిన వరిచేల మధ్యలోంచి ప్రవహించే ఏటికాలువ ఒడ్డున కూర్చుని

నీటి అలల్ని చూస్తూ, నిశ్శబ్దంలో అవి కలిగించే సవ్వడిని వింటూ శారీరక స్పృహ కోల్పోయేవాడిని. ఆర్మూర్ కొండల ప్రక్కలనుండి ప్రవహించే కాలువవెంట పైకి వెళితే కాలువలోని నీరు కొన్నిచోట్ల ఎత్తయిన స్థలంనుండి క్రిందికి ఉధృతంగా పడటం కన్పిస్తుంది. అలా పడిన నీరు విచిత్రంగా మెలికలు తిరిగి, తెల్లగా, పాల నురుగులా తేలిపోయేది. అక్కడినుండి దూరంగా కొబ్బరిచెట్లు కనిపించేవి. తెల్లని కొంగలు అరుస్తూ ఎగిరిపోయేవి గుంపులు గుంపులుగా. దూరంగా ఉండుండీ బస్సులు వెలుతున్న చప్పుడు. మళ్లీ అంతటా నిశ్శబ్దం. అప్పుడు మెల్లగా ఇంటివేపు పయనం. అలాంటి అందమైన సంధ్యాసమయాలు ఎన్నో గడిచిపోయాయి. హైస్కూల్లో చదువుతున్నప్పుడు ఎండాకాలం రాత్రి ఎప్పుడైనా మెలకువ వస్తే రాత్రి నిశ్శబ్దంలో బయటకు నడిచిపోయేవాన్ని. ఎటు చూసినా చల్లని వెన్నెల. కీచురాళ్ల అరుపులు. తిరిగి, తిరిగి పడక మీదికి వచ్చి, (ఆ పడక గన్నేరు చెట్టు కింద ఉండేది) ఎర్రని గన్నేరు పువ్వులోంచి, ఆకుల సందుల్లోంచి నక్షత్రాల్ని చూస్తూ, నిద్దుర పోవటానికి ప్రయత్నించేవాన్ని. నాలోని ఈ భావనల్ని వ్యక్తీకరిస్తూ నేను రాసిన తేటగీతులు మధుయాత్ర, కరగిపోయెద, ఎవరామె, స్మృతిరేఖలు మొదలైనవి.

ఈ తపన, ఈ అశాంతి ఎందుకో తెలిసేది కాదు. కాని ముందు ముందు నేను ఎదుర్కోవలసిన జీవిత మహాసమస్య యొక్క ప్రాథమిక రూపమే అది! ఇదంతా ఎందుకు వ్రాస్తున్నానంటే నా మనస్తత్త్వంయొక్క మూలాల్ని వ్యక్తికరించటానికే. యోగం మానవునిలో బీజప్రాయంగా ఉన్న కళల్ని వికసింపజేస్తుంది. నేను యోగంలో అభివృద్ధి చెందిన కొలదీ, ప్రకృతిలోని సౌందర్యాన్ని గమనించే ఈ రసదృష్టి పెరిగింది. నేను వ్రాసిన ఈ వాక్యాలు నా స్థితికి నిదర్శనాలు.

“నేను ఉన్మత్తభర విహంగాన్ని. నా రెక్కలల్లార్చుకొని వినువీధిలో గిరికీలు కొడుతూ, విశాల నింగినీలిమలో లీనమై, మూగనై, అనంతచైతన్య పరిధిలో ఐక్యమౌతాను”.

అట్లా అని జ్ఞానదృష్టి, వైరాగ్యదృష్టి లేదనలేను. అప్పుడు వ్రాసిన ఈ కవితలు నా మనఃస్థితిని ఇలా చూపుతున్నాయి.

అటు
తూరుపు కొండలపై
లోకాన్ని మేల్కొల్పుతున్న ప్రభాకరుడు

తెలిరేకల వెలుగులతో విచ్చుకుంటూ...
ఇటు
జీవన సంధ్యాసమయంలో,
పిట్టలు గూళ్ళకు చేరుకునే వేళ,
ఏ నిరామయ శాంతి తీరాలకో,
ఏ కాంతి లోకాలకో, ఏకాంతంగా
పయనిస్తున్నాడు సూర్యుడు.
ఒకనాడు
రాజుగా సామ్రాజ్యాలేలినవాడు
నేడు ఈ ధరాతలిమీద అదిగో
ఆ చీకటి కోణాల సమాధిలో
నిద్దుర పోతున్నాడు.
పోయిన వసంతంలో
నవ్విన మల్లెలు
మట్టిలో కలిసి మాయమై...
కాలం సృష్టించే
నిశ్శబ్ద సంగీతపు మత్తులో
లోకం నిద్దుర పోతున్నది.
మేలుకో చెలీ!
పొద్దు వాటారక ముందే
జీవన స్రోతస్వినిలో
పన్నీరు ఆరిపోవక ముందే
లే!
జీవనరహస్యాన్ని భేదించుదాం.

***

సముద్రపు అంచున నిలిచి, నిమీలిత నేత్రుడనై
నింగినీ నీరధినీ చూస్తుంటే, హృదయాన ఎందుకో

తెలియని భీతి.
ఏనాటివో తెలియని, ఆశయాల స్వరూపాల్ని
చీకటి తెరపై సాగరసంగీతపు సహాయంతో
నాలో నేనే ప్రదర్శించుకుంటుండగా
నర నరాన తెలియని అచేతనత్వం ఆవహిస్తుంది.
కోటి కోట్ల యుగాల కాలచక్ర భ్రమణంలో
జన్మాంతర సుఖదుఃఖానుభవాలు ప్రత్యక్షమై
జీవితపు అణువణువూ పరిశోధించిన
వైరాగ్యం... నిర్లిప్తత...
మాటల్లో చెప్పరాని భావమేదో
హృదయాన్ని పగులదీస్తుంది.
తారకాపరివేష్ఠితమైన ఆకాశం.
ఆకాశాన్ని అందుకోవాలని
ఎగిసిపడే సాగరం.
జిగేల్మనే పసిడి జలతారులాంటి
వెలుగునీడల సౌందర్య సందీప్తులు
చిరకాల నేస్తాలుగా
తెలియని ఆత్మ విచార చారచక్షణలో
జీవన వాహిని ఇంకా
సాగిపోతూనే ఉంది.

* * *

పశ్చిమాకాశపు ఎర్రని మంటల్లో
కాలిపోతున్నాడు సూర్యుడు.
శ్మశానం పక్కన నదిలో
తేలిపోతుంది పడవ.
నేను
కాల్తూన్న శవాలకేసి
ఎగిసిపడ్తున్న నిప్పురవ్వలకేసి

చూస్తూ నవ్వుకుంటున్నాను.
విషాద బాణాల్ని
విధినిషాదుడు హృదయంలో
నాటుతున్నాడు.
జీవన రణరంగంలో హతులైన
అమరవీరుల స్మృత్యర్థం
విషాద రాగాలాపనా తరంగాల్ని
సృజిస్తుంది నదీకన్య...
నేను వెన్నెల్లో కలిసి
చెట్ల ఆకులపై జారిపడ్తున్న
వానచినుకుల సంగీతంలోకి,
ఆకుల చిక్కని పచ్చదనంలోకి
తాదాత్మ్య చెందుతూ
లీనమైపోతాను.
ఈ మహా విశ్వపు శయన శాలలో ఇచ్చట
బ్రతుకు బాధల్లేవు.
వెర్రి ప్రేమలో వేసే పిచ్చి కేకల్లేవు.
దూరాన గోరీల తలలపై నల్లగా
తెల్లని ముళ్లతో పాటు
బ్రతుకు వాస్తవికతని స్పష్టికరించే
తుమ్మచెట్లు.
కాల్తూన్న చితిలో కమురువాసనతో పాటు
కరుగుతున్న శరీరం
ఎండమావుల్లాంటి
ఆశల్ని చెలరేపవు.
సన్నని జల్లుగా కురుస్తూన్న
గుడ్డి వెన్నెల్తో పోరాడుతూ
బ్రతుకులకు విశ్రాంతినిస్తున్న

శ్మశానమంటే నాకు యిష్టం.
ఈ క్షణం నేను పొందే
ఈ ప్రశాంతి కోసమే
ఈ నిశీధి చీకట్లలో
బాధామయ లోకాన్ని వదలి
వెళ్లిపోతాను ఎచటికో!
నా అనంతయాత్రాపథంలో
తొలిమజిలీ కాబట్టి
నాకు ఇష్టం
శ్మశానమంటే.

వ్యక్తి, విశ్వము, విశ్వాతీతము. యోగసాధనలో ఈ మూడూ మూడు మెట్లు. యోగి తన వైయక్తిక చేతన నధిగమించినపుడు, సమస్త విశ్వంతో తాదాత్మ్యం చెందుతాడు. అప్పుడు విశ్వంలో అందరూ తనకు సుపరిచితులైనట్లు అనిపిస్తుంది. తాను ప్రతివారి వేదనలో ఐక్యమౌతాడు. తదనుగుణంగా స్పందిస్తాడు.

భావకవిత్వాన్ని, నిగూఢ ఆత్మావేదనలో, చీకట్లో, వెన్నెల్లో ఏవో పరతత్త్వార్థపు సవ్వడులు వినిపించే రవీంద్రుని గీతాంజలి, ఫలసేకరణ, తోటమాలి, ప్రేమకానుకలాంటి కాల్పనిక సాహిత్యాన్నీ చదివితే నా మనస్సు ఊహకందని అదృశ్య సీమల్లోకి వెళ్లిపోయేది. అందుకే కృష్ణశాస్త్రి అంటే నాకు పట్టరాని అభిమానం. మధువూ, మగువలు ఉన్నా, ఆ ఆనందంలో జీవన తత్త్వాన్వేషణ చేసే ఉమర్‌ఖయ్యాం కూడా నాకు అభిమాన పాత్రుడయ్యాడు. ఇక అసలు విషయానికి వస్తే, తనలోని దివ్యత్వాన్ని వ్యక్తీకరించుకోలేని జీవితం వ్యర్థమనే నిర్ణయానికైతే వచ్చాను కాని, 'ఆ సాధనలో నాకు తోడ్పడే మహాత్ములెక్కడ తారసపడతారో' అని చాలా ఆవేదన చెందాను. ఈ అన్వేషణలో 'ఎటైనా వెళ్లిపోదామా' అని కూడా అనిపించేది. అటువంటి సమయంలో ఒక స్నేహితుని ద్వారా ఈ ప్రాంతంలోనే అటువంటి మహాత్ములొకరు ఉన్నారని తెలిసింది. నేను అక్కడ అంటే మోర్తాడులో చదువుకునే రోజుల్లోనే, ఆయన గొప్ప రామభక్తుడని, ఆయనకు పడిపోయిన కాళ్లు చేతులు భక్తి వల్లే తిరిగి వచ్చాయని, వారి గురించి నా తోడి పిల్లలు ఎవరో చెప్పగా విన్నాను. ఇప్పుడు వారి పేరు వినగానే నాకు ఒక విషయం గుర్తుకు వచ్చింది. అప్పుడు నేను ఏడవతరగతి చదువుతున్నాను (1967). మోర్తాడులో వారి ఇల్లు హాస్టలుకు దగ్గరగా ఉండేది. వారికి కొంత వైద్యం తెలుసు.

అందువలన హాస్టల్లోని పిల్లలు చిన్న చిన్న అనారోగ్య సమస్యలెదురైనపుడు వారి వద్దకు వెళ్లేవారు. నేను ఒకరోజు అటువంటి పిల్లలతో వారింటికి వెళ్లాను. అది రాత్రి ఎనిమిది గంటల సమయము. వారింట్లోని ముందరి గది అంతటా ఫ్లోరసెంట్ ట్యూబ్ కాంతిని వెదజల్లుతూంది. లోపలి గదిలో ఒక ఏకతార, హార్మోనియం, వైద్యానికి సంబంధించిన కొన్ని పరికరాలూ ఉన్నాయి. మరో పక్కన ఒక రౌండ్ టేబులూ, దాని చుట్టూ కుర్చీలు ఉన్నాయి. వారు అక్కడే కూర్చుని ఉన్నారు. వారి రూపం చూడగానే నన్ను ఆకర్షించింది. అంతా వెళ్లిపోయినా నేనొక్కన్నే టేబుల్‌పైన ఉన్న భగవద్గీతను చూస్తూ కూర్చున్నాను. అప్పుడు నాకు భగవద్గీత అర్థమయ్యేది కాదు. విశ్వరూప సందర్శనం వంటి బొమ్మల్ని చూస్తూ, ఏదో తెలుసుకోవలసి ఉందని ఆలోచనలో పడేవాన్ని. ఇంతలో వారు నన్ను బయటకు పిలుచుకొని వెళ్లారు. అది వెన్నెల రాత్రి. వారింటికి సమీపంలోనే ఉన్న స్కూల్ ప్లేగ్రౌండ్‌లోకి వెళ్లి కూర్చున్నాము. సృష్టి ఎలా ఉత్పత్తి అయ్యిందీ, పంచభూతాలవల్ల మానవుని మనస్సూ, ప్రాణమూ, శరీరమూ ఎలా పని చేస్తున్నదీ మొదలైన వివరాలు చెప్పసాగారు. మధ్య మధ్య నన్ను కొన్ని ప్రశ్నలడిగారు. ఆ విషయాన్ని వినటం అదే మొదటిసారి కావటం వలన నేను కొన్ని జవాబులు తప్పుగా చెప్పాను. తర్వాత వారు "సమయం వస్తే నువ్వే వస్తావులే. ఇక వెళ్దాం పద!" అని లేచారు. ఇద్దరమూ ఇంట్లోకి వెళ్లాము. వారు వేరొక గదిలోకి వెళ్లారు. నేను టేబుల్ మీద ఉన్న కాపీ తెరచి చూశాను. అందులో పూర్వజన్మకు సంబంధించిన కొన్ని రహస్యాలు వ్రాయబడి ఉన్నాయి. 'బహుశా అది డైరీ కావచ్చు, చూడటం తప్పు కదా!' అనే సంకోచంతో మూసేశాను. ఆ తర్వాత వారి వద్ద సెలవు తీసుకొని వచ్చేశాను. ఈ ఒక్క సంఘటన మినహాయిస్తే వారితో నాకు పెద్ద పరిచయమేమీ లేదు.

నిర్గుణ బ్రహ్మతత్త్వాన్ని గురించి నేను మొదటిసారి చదివింది విశ్వనాథవారి వేయిపడగల్లో. ఆ నవలలో కథానాయకుడైన ధర్మారావు ఒకనాటి సాయంత్రము వేణుగోపాల స్వామి ఆలయం ప్రక్కన కొలని అంచున కూర్చున్నపుడు గిరికతో ఈ విషయం చెప్తాడు. గిరిక కొన్ని ప్రశ్నలడుగుతుంది. అందుకు ధర్మారావు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు సాకారులని, వీరికి అతీతమైన నిర్గుణ తత్త్వమొకటి ఉందని వివరిస్తాడు. గిరిక భక్తి సాధకురాలు, అందునా మధురభావ సాధకురాలు కావటం వలన ఆ విషయంపై ఎక్కువ శ్రద్ధ చూపదు. దానితో ఆ సంభాషణ ముగుస్తుంది. ఐతే అదే నవలలో హరప్పానాయుడు బ్రహ్మరంధ్రం గుండా ప్రాణోత్క్రమణం చేయటం కుతూహలాన్ని, విస్మయాన్ని కలిగించింది.

అవి నిగూఢ శాస్త్రవిషయాలే కాని కల్పితం కావని నాకు తెలుసు. అలాగే విశ్వనాథ తన ఎన్నో నవలల్లో, అనేక అధ్యాత్మిక విషయాల్ని చక్కగా వివరించారు. వారి చెలియలి కట్ట నాలో ఎంతో అలజడిని కలిగించింది. అందులో ముఖ్య విషయము పాశ్చాత్యసంస్కార ప్రభావం వలన ఒక వ్యక్తి వదినను లేవదీసుకు పోయి చివరకు పశ్చాత్తాప పడటం. పశ్చాత్తాపాన్ని పొందిన ఆ జంట ఉప్పెన వస్తున్న సమయంలో సముద్రంలోనికి వెళ్లి అందులో కలిసి పోతారు. ఆ రచనా విధానమూ, అందులోని బైరాగి పాత్ర, తాళప్రమాణాన లేచిన సముద్రపు అలల్లో వారు మునిగినప్పుడు, అంతర్ముఖులైన వారిముందు మరల బైరాగి కన్పించటం, 'మనసు గుర్రమురోరి మనిషీ' అన్న ఆయన పాట, ఒక మహాద్భుత దృశ్యాన్ని కళ్ల ముందు చిత్రీకరించినట్లుగా నిలిచిపోయింది. నా లేత మనస్సులో వాగతీతమైన అనుభూతిని ముద్రించిన తెరచి రాజు, మ్రోయుతుమ్మెద, బుచ్చిబాబు చివరకు మిగిలేది ఇలా ఎన్నో.

చెప్పేదేమిటంటే ఇవన్నీ నాలో నాకు తెలియకుండగనే ప్రవహించిన సెలయేళ్లు. బహుజన్మ పరంపరాప్రాప్తమైన నా మనస్తత్త్వంలో అవన్నీ కలిసి మహాప్రవాహమైన తర్వాత, గతంలోకి చూసుకుంటే, వీటన్నిటికీ పరస్పర సంబంధం ఎలా ఉందో బోధపడుతుంది. గ్రంథాలయం గురువుగా ఎందరెందరో మేధావుల గ్రంథాలు, నాలో నిక్షిప్తమైఉన్న రసలోకాలకు చక్షువులను ప్రసాదించాయి. 1967 లో గురుదేవులు శ్రీనారాయణ మహర్షులతో పరిచయం కలిగిన తర్వాత మూడు సంవత్సరాలకు, ఇప్పుడు ఆత్మాన్వేషణపై నిజమైన ఆసక్తి కలిగింది. "సమయం వచ్చినపుడు నువ్వే వస్తావు" అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. సంవత్సరాలు మూడే ఐనప్పటికీ, ఇప్పుడు నేను మానసికంగా ఎంతో ఎదిగాను. అందువల్ల అది ఎన్నో సంవత్సరాల గతంలా అనిపిస్తుంది. వారి కొరకు మళ్లీ ఆ ఊరు వెళ్లాను. వారు నన్ను గుర్తు పట్టారు. ఐతే "ఇవన్నీ నీకెందుకు అందరిలాగే జీవించరాదా?"అనేవారు. వారు అద్వైత సిద్ధి పొందిన యోగి అని అర్థమైంది. వారానికి ఒకసారయినా వారి వద్దకు వెళ్లేవాన్ని. ఈ రోజుల్లో వారు నాకు సాంఖ్యం చెప్పేవారు. ఇక్కడ సాంఖ్యం అంటే ఆత్మానాత్మ విచారమే. ఈ జగత్తు, అలాగే ఈ శరీరం పంచభూతాలవలన ఏర్పడినాయనీ, వాటిని విడదీసి ఉన్నది ఉన్నట్లుగా గ్రహిస్తే మనఃప్రాణ, శరీరాలే నేను అనే భ్రాంతి విడిపోతుందనీ చెప్పేవారు. వారి సాంఖ్యబోధకు శాస్త్రాన్ని జోడించి, నా మాటల్లో చెపితే ఇలా ఉంటుంది.

వెనుక బ్రహ్మాన్ని ఆధారంగా కలిగిన ప్రకృతియొక్క పరిణామమే పంచభూతాలు. ఈ పంచభూతాల వలన పరిణామక్రమంలో మొక్కలు, వృక్షాలు, కీటకాలు, జంతువులు, మానవుడు మొదలగు సమస్తం ఏర్పడినాయి.

సృష్టిలోని సర్వం త్రిగుణాల వలన, పంచభూతాల వలన ఏర్పడినందున సృష్టిలో భాగమైన మానవుని మనస్సు, ప్రాణము, శరీరమూ పంచభూతాల వలన ఏర్పడినవే.

విశ్వసృష్టి వెనుకనున్న బ్రహ్మమే, ఈ వ్యక్తి సృష్టి వెనుక ఆత్మగా ఉన్నది. 'నేనెవ్వరు?' అని కదా మన అన్వేషణ. సాధారణంగా మనం మన దేహాన్ని, జ్ఞానేంద్రియాలను, ప్రాణ, అంతరేంద్రియాల సమూహాన్ని 'నేను' అంటుంటాము. కాని ఇవి పంచభూతాలు కదా! పంచభూతాలు జడం. మనం చైతన్యస్వరూపులం.

జడమైన పంచభూతాలే తాము అనుకునే ఈ భ్రాంతి తొలగిపోవటానికే మనం సాంఖ్య విచారం చేయాలి. ప్రకృతిని సంఖ్యలలో వివరించి చెప్పేదే సాంఖ్యం. మొదట మన అంతఃకరణాన్ని గురించి తెలుసుకుందాం!

1. ఎరుక 2. మనస్సు 3. బుద్ధి 4. చిత్తము 5. అహంకారము. ఈ అయిదింటిని అంతఃకరణాలని, అంతరేంద్రియాలని అంటారు. ఎరుకని వదలి తక్కిన నాలుగింటిని అంతఃకరణ చతుష్టయమని కూడా అంటారు. ఈ అంతకరణ వ్యవహారానికి ఎరుక, అహంకారము ఆధారతత్త్వాలు. క్రింద వేదిక, పైన డేరా ఉన్న రంగస్థలంపై పాత్రధారులు నటించునట్లుగా ఎరుక-అహంకారముల ఆధారంతో మనస్సు, బుద్ధి, చిత్తము పనిచేస్తున్నాయి. ఎరుక అంటే తెలివి. గాఢనిద్రలో తెలివి లేదు. తెలివి లేనప్పుడు నేనున్నాననే ఎరుక లేదు. తాను లేనప్పుడు ఆలోచించటంగాని, నిర్ణయించటంగాని, చలించటంగాని ఎలా సాధ్యమౌతుంది? తన్ను తాను గుర్తించటమే ఎరుక. తన్ను గుర్తెరిగిన పిదపనే లోకాన్ని గుర్తిస్తారు. ఎరుక ఒక వెలుగు అయితే ఆ వెలుగుతో లోకాన్ని చూసేవాడు జీవుడు.

జీవుడు:

- ఎరుక ద్వారా తెలుసుకొంటాడు.
- మనస్సు ద్వారా ఆలోచిస్తాడు.
- బుద్ధి ద్వారా నిర్ణయిస్తాడు.
- దేనినైనా పోల్చుకునేటపుడు చిత్తం ద్వారా పూర్వానుభవాన్ని స్మరిస్తాడు.
- అహంకారము ద్వారా నేను అంటాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/book/Naa+Sadhana+Katha

* * *